ఆ పార్టీకి ఓటమి భయం

- ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ
- తప్పుడు ఫిర్యాదు చేసి రైతుబంధుకు అడ్డుకట్ట
- మంథని ప్రజలు ఆలోచించండి
- బీసీ బిడ్డను ఆదరించండి
- కారుకు ఓటేసి అసెంబ్లీకి పంపించండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

మంథని రూరల్, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకున్నదని..అందుకే కుట్రలు చేసి రైతుబంధును అడ్డుకున్నదని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం తోటగోపయ్యపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అన్నదాతకు వెన్ను దన్నుగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌కు రైతులంతా మద్దతుగా ఉన్నారన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. రైతుబంధును నిలిపివేయించిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ నుంచి గల్లీ వరకు ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని దుయ్యబట్టారు. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా చెప్పుకునే మంథని కాంగ్రెస్ అభ్యర్థి ఈనాడు ఒకరి కాళ్ల కింద ఫొటో పెట్టుకునే స్థాయికి దిగజారిపోయారని, మంథనిలో ఆయన ఓటమిని అంగీకరించారన్నారు. తరుచూ పార్టీలు మారే విజయశాంతితో మంథనిలో ప్రచారం చేయించుకోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఆయన మంథనిలో భారీ మీటింగ్ పెట్టి పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారని, ఆ నగదును ప్రజలను ఇస్తే బాగుండేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకులకు ప్రజలు అవసరం లేదు కానీ వాళ్ల ఓట్లు మాత్రమే కావాలని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మబోరన్నారు. ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి తనను అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఆకుల కిరణ్, మండలాధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరంశంకర్‌లాల్ ఉన్నారు.

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

ఉద్యమబిడ్డ కోరుకంటిని గెలిపించండి

- ఆయన గెలుపుతోనే మరింత అభివృద్ధి
- సింగరేణి కార్మికులకు న్యాయం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

గోదావరిఖని, నవంబర్ 28: తెలంగాణ ఉద్యమకారుడు ప్రస్తుత రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు ప్రజలకు పిలుపునిచ్చారు. గోదావరిఖని పట్టణం తిలక్‌నగర్ డౌన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చందర్ గెలుపుతోనే నియోజకవర్గ ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఆయన ఐదేండ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల బతుకుల్లో వెలుగులు నింపారని కొనియాడారు. రాష్ట్రంలో మరోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఈసారి ఎవరు ఊహించని విధంగా తెలంగాణ రాష్ట్రంను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకవెళ్తే అవకాశం ఉంటుందన్నారు. సింగరేణి లో 21 సంవత్సరాల క్రితం జాతీయ సంఘాల పుణ్యాన పోయిన డిపెండెంట్ ఉద్యోగాల ను రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే సాధ్యమైందని ఇప్పటికే 12వేల పై చిలుకు డిపెండెంట్ ఉద్యోగాలను సాధించి సింగరేణికార్మికులుగా యువరక్తం పని చేస్తుందన్నారు. 1999-2000లో 10 శాతం లాభాల వాటాతో ప్రారంభమై 2014 వరకు కేవలం 6 శాతం లాభాల వాటా పెరిగితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 16 శాతం లాభాల వాటా పెరిగి 32 శాతం ను చెల్లిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 30న జరిగే ఎన్నికల్లో సింగరేణి కార్మికులు బీఆర్ఎస్‌కు ఓటు వేసి కోల్‌బెల్టు వ్యాప్తంగా 11 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కెంగర్ల మల్లయ్య, కనకం శ్యాంసన్, గండ్ర దామోదర్, వెంకటేశ్, పుట్ట రమేశ్, మండ రమేశ్ పాల్గొన్నారు.

'రేపు ప్రతి ఒక్కరూ ఓటేయాలి'

కోల్‌సిటీ, నవంబర్ 28: 'ఓటు ప్రతి పౌరుడి ప్రథమ హక్కు..ఆ హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.. ఓటు హక్కును కోల్పోయిన వారికి ప్రశ్నించే హక్కూ కోల్పోయినట్టే.. ఓటు హక్కు వినియోగంతోనే సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నా, ఇతర పథకాలను అనుభవించాలన్నా, ఉపాధి అవకాశాలు పొందాలన్నా .. అందుకు కనీస అర్హత ఓటు వేయడమే.. ఈనెల 30న ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ దగ్గరలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలి' అని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేష్ సింగ్ రానా ఓటర్లకు సూచించారు. ఓటు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి గోదావరిఖని గాంధీ చౌక్ వరకు 2కే రన్ నిర్వహించారు. రామగుండం ఆర్వో అరుణ శ్రీతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో మాట్లాడారు. సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థుల ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిషనర్ నాగేశ్వర్, ఏఆర్‌వో కుమారస్వామి, మెప్మా డీఎంసీ, నోడల్ అధికారి రజని, స్వీప్ నోడల్ అధికారి రవూఫ్ ఖాన్, స్వరూపారాణి, పోలీస్ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, డా.కల్పన, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

- నోట్ల కట్టలతో వస్తున్న ఆ పార్టీ అభ్యర్థికి
- ఓటుతో గుణపాఠం నేర్పాలి
- అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయాలి
- రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్



మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబర్ 28: నోట్ల కట్టలతో ఓట్లను కొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ కుట్రలను తిప్పికొట్టాలని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 30న కారు గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గోదావరిఖని తిలక్‌నగర్ డౌన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండుసార్లు ఓడిపోయానని సెంటిమెంట్‌ను ఒలకబోస్తూ నాటకాలు అడుతున్నాడని, కాంగ్రెస్ అభ్యర్థి కుతంత్రాలను ప్రజలందరూ అప్రమత్తమై తిప్పి కొట్టాలని కోరారు. నోట్లతో ఓట్లు కొనాలని చూసే నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ అభ్యర్థి దిగజారుడు రాజకీయానికి తెర లేపాడని ఆరోపించారు. నిన్నటికి నిన్న నోట్ల కట్టలు తనపై దుష్ప్రచారం కోసం ముద్రించిన కరపత్రాలు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ దాడుల్లో పట్టుబడడం చూశామన్నారు. దొడ్డిదారిన గెలిచేందుకు తనపై దుష్ప్రచారమే లక్ష్యంగా ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను ఇక్కడ దింపడమే గాక ఆంధ్ర ఏజెన్సీ నిర్వహించే సోషల్ మీడియాలో తనపై అసభ్యకర పోస్టులు పెట్టడాన్ని గమనించాలన్నారు. ఓడిన తర్వాత హైదరాబాద్ వెళ్లి అక్రమ దందాలు చేస్తాడని ఆరోపించారు. నియోజక వర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రామగుండంను దత్తత తీసుకోని మరో సిరిసిల్ల గా మారుస్తానని మంత్రి కేటీఆర్ ఇచ్చిన మాటను గుర్తు చేశారు. నియోజకవర్గంలో దాదాపు లక్ష మంది కార్యకర్తల సభ్యత్వం కలిగిన అతిపెద్ద బీఆర్ఎస్‌ను ఓడించాలంటే ఆకాశం మీద ఉమ్మివేసినట్టేనని ఎద్దేవా చేశారు. ఉద్యమంలో జెండాలు, కులాలు, మతాలు, పక్కన పెట్టి కదం కలిపి నడిచినట్టు బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. రామగుండం ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ప్రజలు పాలకుడిని ఎన్నుకునే ముందు అతని వ్యక్తిగత గుణగణాలు, అతని వెనుకున్న పార్టీ అధినేత, ప్రజల కోసం గతంలో చేసిన పనులు పథకాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రలోభాలకు తాత్కాలిక ప్రయోజనాలకు లొంగకూడదన్నారు. సీఎం కేసీఆర్ తాగునీరు, సాగునీరు మానవీయ కోణంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన కొనసాగుతోందన్నారు. తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడుకోవాల్సిన వస్తే 2014కు ముందు 2014 తర్వాత అని చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. రామగుండం నియోజక వర్గం పోరాటాల అడ్డా, త్యాగాల గడ్డ అని హింసకు నిర్బంధానికి గురైన ప్రాంతమని ఇక్కడి ప్రజల చైతన్యశీలురన్నారు. చందర్ ఎమ్మెల్యేగా ఐదేళ్ల కాలంలో 50 యేళ్ల అభివృద్ధిని చేసి చూపారన్నారు. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకున్న కరోనా కాలంలో సైతం వెరవక చందర్ ప్రజలకు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, టీబీజీకేఎస్ అధ్యక్షులు వెంకట్రావు, నాయకులు కౌశిక హరి, పీటీ స్వామి, కో-ఆప్షన్ తస్నీం భాను, నాయకులు మాదాసు రామ్మూర్తి, దేవరాజ్, సత్యప్రసాద్, చిప్ప రాజేష్, మీసాల కృష్ణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెయ్యికి ఓటేస్తే బతుకులు ఆగమే

బైక్ ర్యాలీ పాల్గొన్న కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబర్ 28: సీఎం కేసీఆర్ నేతృత్వంలో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసిందని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. జీడీకే-1వ గనిపై మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోదావరిఖనిలో ఉదయం భారీ బైక్ ర్యాలీ తీశారు. గులాబీ శ్రేణులు తరలివచ్చాయి. స్థానిక తిలక్‌నగర్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ అన్ని ప్రాంతాల మీదుగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాకు చేరుకున్నది. ఆయా ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు భారీ స్వాగతం పలికారు. అనంతరం కోరుకంటి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో సింగరేణి కార్మికులు ఎన్నో హక్కులను డిమాండ్లను కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ వారసత్వ హక్కును పునరుద్ధరించారని, ఉద్యమ సమయంలో ఏకతాటిపైకి వచ్చి పోరాడేమో అదేవిధంగా 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కార్మిక లోకం ఒకే తాటిపైకి వచ్చి బీఆర్ఎస్‌కు మద్దతు నిలిచి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ జాతీయ సంఘాలు చేసిన నిర్లక్ష్యంతో వారసత్వ హక్కు పోయిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు, బీజేపీ బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో 45 రోజులు జైలు జీవితం అనుభవించానని 125 కేసులు నమోదయ్యాయని అన్నారు. ఉద్యమ సమయంలో మక్కాన్ సింగ్ ఆంధ్రా పార్టీలకు మద్దతుగా నిలిచాడన్నారు. 10 ఏళ్ల కాలంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగ నిలిచిందన్నారు. మంత్రి కేటీఆర్ రామగుండాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో మేయర్ అనిల్‌కుమార్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, కార్పొరేటర్ ఇంజపురి పులెందర్, నాయకులు గంట దామోదర్, నూనె కొంరయ్య, కనకం శ్యాంసన్, జావిద్ పాషా, వడ్డెపల్లి శంకర్, చెల్కలపల్లి శ్రీనివాస్, వెంకటేష్, మల్లారెడ్డి, మండ రమేశ్, పుట్ట రమేశ్, నారాయణ తదితరులున్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించండి

- మిమిక్రీ ఆర్టిస్ట్, నటుడు శివారెడ్డి
- నందిమేడారంలో కొప్పులకు మద్దతుగా ప్రచారం

ధర్మారం, నవంబర్ 28: నిస్వార్థపరుడు, సేవాతత్పరుడు, నిగర్వి మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని మిమిక్రీ ఆర్టిస్ట్, సినీ నటుడు శివారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 30న కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. మంగళవారం ధర్మారం మండలం నందిమేడారంలో ధర్మపురి అభ్యర్థి కొప్పులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ మేరకు నంది మేడారంలో మంత్రి ఈశ్వర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే కొప్పుల మళ్లీ మంత్రి కావడం ఖాయమని చెప్పారు. అందరికీ మంచి చేసే ఈశ్వర్‌ను మంచిమనసుతో దీవించాలని కోరారు. తాను 150 సినిమాల్లో నటించానని, మిమిక్రీ ఆర్టిస్ట్ అయిన నేను ఏనాడు ఏ పార్టీలో చేరలేదని ఏ పార్టీ తరపున ఇదివరకు ప్రచారం కూడా చేయలేదని, మనసున్న మారాజు మంత్రి ఈశ్వర్ తరుపున నేను ఇక్కడికి వచ్చి స్వచ్ఛందంగా ప్రచారం కోసం వచ్చానని ఆయన చెప్పారు. ఈశ్వర్ ఒక నీడనిచ్చే పెద్ద వృక్షం లాంటి వాడని, ఆ వృక్షం ద్వారా ఫలాలు ఎలా అందుతాయో అలాంటి గొప్ప వ్యక్తిత్వం గల నాయకుడని కొనియాడారు. ప్రజలందరినీ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని అని ఆయన అన్నారు. మంత్రి ఈశ్వర్ ప్రజాసేవకే అంకితమైన గొప్ప నేత అని ఆయన కొనియాడారు. సినీ నటులు బాలయ్య, పవన్ కళ్యాణ్ ఓట్ల అడిగితే ఎలా ఉంటుందో మిమిక్రీ చేసి అందరిని శివారెడ్డి నవ్వించారు.